క్లుప్తంగా

ఎలక్ట్రో2కే25 ఈవెంట్‌లో విద్యార్థుల సత్తా



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో నిర్వహించిన ఎలక్ట్రో2కె25 ఈ వెంట్‌లో మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల భౌతిక విభాగం విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 8 విభాగాల్లో పాల్గొన్న విద్యార్థులు ఏడు విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శన చేశారు. 5 విభాగాల్లో ప్రథమ స్థానం రెండు విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి విద్యార్థులను అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత మెరుగైన ప్రదర్శనతో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని, కళాశాల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్ శాఖ అధ్యాపకులు జీ.వి. గంగాధరరావు టి.దేవేందర్‌రెడ్డి, షేక్ జుబేదా, వైస్ ప్రిన్సిపాల్ పి. శైలజ, డాక్టర్ నాగేశ్వరరావు, వకులప్రియ, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: బీవీఆర్ ఆర్కెస్ట్రా, ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద సినీ నటుడు శోభన్‌బాబు 17 వ వర్ధంతి సందర్భంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న సినీ సంగీత విభావరి, కళాకారులకు సత్కార కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ శోభన్‌బాబు నటనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీవీఆర్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు బీవీ మోహన్‌రావు, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, ప్రభల శ్రీనివాస్, ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులు సయ్యద్ ఆలీ, మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, కె.రాజు పలు చిత్ర గీతాలను ఆలపించారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేషంగా అర్చనలు నిర్వహించారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎస్ రాజు, కార్యదర్శి డి.శివరామరాజు తదితరులు పర్యవేక్షించారు.

సినీనటి తేజశ్వి సందడి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సినీనటి తేజశ్వి మడివాడ శుక్రవారం నగరంలో సందడి చేశారు. టిక్కిల్‌రోడ్డులోని అంబటి సిల్క్స్ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయం, చక్కదనం, అచంచలమైన కస్టమర్ల నమ్మకానికి అంబటి సిల్క్స్ ప్రతీకగా పేర్కొన్నారు. కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ షాదీఖానాలో శుక్రవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అధ్వానంగా రైల్వేస్టేషన్ రహదారి



మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డులో చెత్తాచెదారం



పేరుకుపోయిన వ్యర్థాలు

- ఎక్కడి చెత్త అక్కడే
- పట్టించుకునే వారు కరువు
- స్థానికుల ఆందోళన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ రైల్వేస్టేషన్ రోడ్డును పట్టించుకునే వారు లేకపోవటంతో అధ్వానంగా మారింది. రైల్వే అధికారులు చూస్తారని నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది, నరగ పాలక సంస్థ చూస్తుందని రైల్వే అధికారులు వదలివేస్తున్నారు. దీంతో చెత్తా చెదారం పేరుకుపోయి పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు సైతం విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పందుల సంచారం.....

రైల్వే స్టేషన్ పరిసరాల్లో పందుల సంచారం అధికంగా ఉంది. ఇక్కడ పట్టించుకునే వారు లేకపోవటంతో రోజురోజుకు పందుల బెడద అధికం అయిందని ప్రజలు అంటున్నారు. పందులు, దోమల వల్ల ఎప్పుడు ఏ అనారోగ్య సమస్యలు వస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలమైన రైల్వే గోడలు.....

ఇక్కడ రైల్వేస్టేషన్ రోడ్డులో రైల్వే అధికారులు నిర్మించిన ప్రహరీ శిథిలమైంది. దీంతో రైల్వే స్టేషన్ వైపు నుంచి పందులు, దోమలతో పాటు ఆకతాయిలు వస్తున్నారు. వీరి వల్ల తమ ప్రాంతానికి భద్రత కరువయ్యిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట ఇంటి బయట నిలిపిన వాహనాల్లో పెట్రోల్ సైతం మాయం అవుతుందని వాపోతున్నారు. ఈ విషయం ఎవరికి చెప్పుకోవాలో తెలియక నానాయాతన పడుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి.....

రైల్వే అధికారులు స్పందించి ఇక్కడ అవసరమైన భద్రత చర్యలు తీసుకోవటంతో పాటు శిథిలమయిన రైల్వే గోడలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. అలాగే క్రమం తప్పకుండా పరిసరాలు శుభ్రం చేయాలని కోరుతున్నారు. నగర పాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని విన్నవిస్తున్నారు.

జననేతతో ఆత్మీయ కలయిక

బ్రాహ్మణ సంఘాలన్నీ వైఎస్ జగన్‌వైపే ఉన్నాయని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం బ్రాహ్మణ సంఘాల నాయకులు పత్రి శ్రీను అన్నారు. జననేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పత్రి శ్రీనివాస్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.
–మధురానగర్ (విజయవాడసెంట్రల్)



డౌన్ సిండ్రోమ్‌ను ఆరంభ దశలోనే గుర్తించాలి



ప్రత్యేక చిన్నారులతో చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): డౌన్ సిండ్రోమ్‌ను ఆరంభ దశలోనే గుర్తించి క్రమ పద్ధతిలో శిక్షణ ఇవ్వటం ద్వారా కొంత వరకు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణ కుమారి తెలిపారు. చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డేను పురస్కరించుకుని అవగాహన, ఉచిత దంత, నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ అనేది జబ్బు కాదని, మనలో సహజంగా ఉండే క్రోమోజోమ్‌లలో ఒక క్రోమోజోమ్ అధికంగా ఉండటం వల్ల పిల్లల్లో బుద్ధి మాంద్యత ఏర్పడు తుందన్నారు. దీని వల్ల పిల్లలు మంగోలియన్స్ పోలికలతో ఉండటం జరుగుతుందన్నారు. డౌన్ సిండ్రోమ్ చిన్నారులలో అధికంగా నేత్ర, దంత సమస్యలు ఉంటాయన్నారు. కావున తాము ఇక్కడ ఉచిత దంత, నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రముఖ నేత్ర వైద్యులు, దంత వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు కూటమి ప్రభుత్వం ద్రోహం

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): విజయవాడ నుంచి హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాధించిన హజ్ ఎంబార్కేషన్ పాయింట్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి ముస్లిం మైనార్టీలకు తీరని ద్రోహం చేసిందని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ మండిపడ్డారు. శుక్రవారం వించిపేటలో మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో రాష్ట్రంలోని ముస్లింలు హజ్ యాత్రకు వెళ్లేందుకు పొరుగు రాష్ట్రాలైన హైదరాబాద్, బెంగళూరు నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారన్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ చొరవతో విజయవాడకు హజ్ ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేయడడంతో పాటు హజ్ యాత్రికులకు రూ. 80వేలు సబ్సిడీ భారాన్ని భరించారని గుర్తుచేశారు. గత ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికులకు రూ.లక్ష సబ్సిడీ ఇస్తామని మైనార్టీలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత సబ్సిడీ ఇవ్వకపోగా విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్‌ను రద్దు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైన విజయవాడ హజ్ ఎంబార్కేషన్‌ను పునరుద్ధరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష సబ్సిడీని ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



బ్యాంక్ సత్యనారాయణపురం బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఉప్పటూరి గోపాలకృష్ణ ప్రసాద్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఫెడరల్ బ్యాంక్ 42వ బ్రాంచ్‌ను సత్యనారాయణ పురం భగత్‌సింగ్‌రోడ్డులో శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఐకేఎఫ్ ఫైనాన్స్ సంస్థ చైర్మన్ ఉప్పుటూరి గోపాలకృష్ణ ప్రసాద్ హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెడరల్ బ్యాంకు కస్టమర్లకు అత్యుత్తమ సేవలు అందిస్తు ఎంతో ఆదరణ పొందుతుందని తెలిపారు. ఖాతాదారులకు ఎంతో విలువైన సేవలు అందజేస్తు అత్యధిక డిపాజిట్‌లతో ఖాతాదారులకు సంతృప్తికర సేవలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందజేసే లక్ష్యంతో నగరంలో 4వ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. విజయవాడ రీజనల్ హెడ్ జయశేఖర్ రెడ్డి, తిరుపతి క్లస్టర్ హెడ్ స్వాతిప్రియ మాట్లాడుతూ ఫెడరల్ బ్యాంకు అనేది స్థానిక ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిందన్నారు. వారి అవసరాల కోసం రుణాలు అందజేస్తూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. కేరళలో తమ బ్యాంకు ప్రథమ స్థానంలో ఉందని వెల్లడించారు. ఇందుకు తమ బ్యాంకు అందిస్తున్న సేవలే నిదర్శనమని వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని శాఖలు ఏర్పాటు చేసి ఖాదారులకు సులువైన, మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ గద్దం సత్యనారాయణ, మెట్రో హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ వి. రమణి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో రెండు రోజుల ట్రావెల్ ఎగ్జిబిషన్

> ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ డైరెక్టర్ అనురాగ్ గుప్తా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విజయవాడలో రెండు రోజులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ (ఐఐటీఈ) డైరెక్టర్ అనురాగ్ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ బందర్ రోడ్‌లోని రాఘవయ్య పార్క్ సమీపంలోని విజయ కృష్ణ సూపర్ బజార్‌పై అంతస్తులో ఉన్న అమరావతి కన్వెన్షన్స్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో ప్రదర్శన ఉంటుందన్నారు. ఐఐటీఈ అనేది ట్రావెల్, టూరిజం, రైల్వేలు, హాస్పిటాలిటీ, అనుబంధ పరిశ్రమల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రదర్శిస్తుందని వివరించారు. ఈ ట్రావెల్ ఎగ్జిబిషన్ దేశీయ, అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానాలు, హోటళ్ళు, రిసార్ట్‌లు, అనుబంధ సేవలు, దేశ విదేశీ టూర్ ఆపరేటర్ల వివరాలు అందిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టూరిజంతో పాటు మధ్యప్రదేశ్ టూరిజం తదితర రాష్ట్ర పర్యాటక సంస్థలనూ ప్రదర్శిస్తుందన్నారు. దేశీయంగా కూర్గ్‌లోని అత్యంత విలాసవంతమైన రిసార్ట్‌లలో ఒకటైన కర్ణాటక టింబర్ టేల్స్, ఇతర ప్రముఖ ప్రాంతాలనూ చూపిస్తుంది. సందర్శకులకు ఈ ప్రదర్శన ప్రవేశం పూర్తిగా ఉచితమని, పర్యాటక ప్రియులే కాకుండా నగర వాసులంతా సందర్శించాలని ఐఐటీఈ డైరెక్టర్ అనురాగ్ గుప్తా ఆహ్వానించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): తాగునీటి సరఫరా విషయంలో సమస్యల పరిష్కారానికి విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. తాగునీరు అందక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సాక్షి పత్రికలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. రంగు మారిన నీటిని సూపర్ క్లోరినేషన్ ద్వారా సాధారణ రంగులో సరఫరా అయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ ఇంజినీరు పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.శ్రీనివాసరెడ్డి, డీఈఈలు, ఎస్.ప్రభాకరావు, లక్ష్మి సింధూర ఏఈలు సతీష్, మాధవ్‌లు 64, 62, 61, 57 డివిజన్లలో పర్యటించి తాగునీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వేసవి కాలంలో నగరంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కృషి చేస్తాయన్నారు. నీరు ఎరుపు రంగు నుంచి సాధారణ కలర్‌లోకి వచ్చేందుకు స్పెషల్ క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. శనివారం నాటికి పూర్తి సాయిలో తాగునీరు సాధారణస్థితిలో సరఫరా అవుతుందని పేర్కొన్నారు. నగరంలోని శివారు ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బంది లేకుండా తగిన విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నీరు సరఫరా అయ్యే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

రౌడీషీటర్ నుంచి 21 కిలోల గంజాయి స్వాధీనం

పాయకాపురం(విజయవాడరూరల్): రౌడీషీటర్ కుందేటి గణేష్ అలియాస్ గని గంజాయి అమ్ముతుండగా శుక్రవారం నున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పాయకాపురం వైఎస్సార్ పార్కు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న గణేష్‌ను ఎస్ఐ పండుదొర అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గణేష్‌పై నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో 24 కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసుస్టేషన్లో 5, నున్నలో 14, గవర్నరుపేటలో 2, మాచవరంలో1, వన్‌టౌన్‌లో 1 చొప్పున కేసులున్నాయి.

బాలలకు రక్షణ కవచం పోక్సో చట్టం



మధురానగర్(విజయవాడసెంట్రల్): బాలలకు రక్షణ కవచం పోక్సో చట్టం అని కమర్షియల్ కోర్టు జడ్జి డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. గులాబీతోట అమరావతి వాకర్స్ క్లబ్‌లో ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ చిన్నం రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ పోక్సో చట్టం 2012లో రూపొందించారని చెప్పారు. 18 ఏళ్ల లోపు బాలలకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. డాక్టర్ చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పూర్ణచంద్రరావు, హరి, అమరావతి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొండా, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండాయగుంట రాము, సభ్యులు పాల్గొన్నారు.

హెరిటేజ్ వేవ్స్ శారీస్ ఎగ్జిబిషన్ ప్రారంభం



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎంజీరోడ్డులోని లెమన్‌ట్రీ హోటల్‌లో సెకండ్ స్కిన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన హెరిటేజ్ వేవ్స్ శారీస్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను శుక్రవారం ప్రారంభించారు.
సెకండ్ స్కిన్ సంస్థ మేనేజర్ రాజీనీస్ మాట్లాడుతూ ఈ నెల 21న ప్రారంభమైన ఎగ్జిబిషన్ 22 తేదీ వరకు రెండు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. పటాన్ పటోలా, ప్యూర్ జరీకోట, బెనారస్, రాజ్‌కోట్ పటోలా, టస్సార్ ఎంబ్రాయిడరీ, టస్సార్ ప్రింటెడ్, కంచి కళంకారీ, చందేరీ సిల్క్ తదితర రకాల చీరలు ప్రదర్శనలో అమ్మకానికి ఉంచామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మ్యూజియం రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ సీవీఆర్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యూజియం రోడ్డు, కోర్టు కాంప్లెక్స్ ఏరియా, చెరుకుపల్లి వారి వీధి, కోదండ రామిరెడ్డి వీధి, వెంకటేశ్వరావు వీధి, రామమందిరం వీధి, ఆంధ్ర హాస్పిటల్ ఏరియా, ప్రకాశం రోడ్డు, జేడీ హాస్పిటల్ రోడ్డు , కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు, దుర్గయ్య వీధి, కస్పా వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ శ్రీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, రైల్వే ట్రైనింగ్ సెంటర్, రైల్వే క్వార్టర్స్ ఏరియా, శ్రీనగర్ కాలనీ ఒకటవ రోడ్డు, జీరో లైన్, రెండో రోడ్డు, మూడవ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వీఎంసీకి పన్ను చెల్లింపులకు క్యాష్ కౌంటర్లు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వీఎంసీకి చెల్లించాల్సిన వివిధ పన్నుల చెల్లింపుల కోసం నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 13 క్యాష్ కౌంటర్లను ఏర్పాటు చేశామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లోన్ని క్యాష్ కౌంటర్లో ఆరు క్యాష్ కౌంటర్లు మాత్రం ప్రతిరోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు, సర్కిల్–2 పరిధిలోని సత్యనారాయణ పురం ఏకేటీపీఎం స్కూల్ పక్కనే ఉన్న సర్కిల్ కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు, పటమట సెంటర్‌లో ఉన్న బీవీఆర్ కాంప్లెక్స్ సర్కిల్–3 కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు పన్ను చెల్లింపుదారులకు అందుబాటులో ఉంటాయని, ఆయా క్యాష్ కౌంటర్లు సెలవు దినాల్లో కూడా పనిచేస్తాయని ఆయన తెలిపారు. నగరవాసులు వీఎంసీకి పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

బీబీఏ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. ఎన్నికల ప్రధాన అధికారి డి.పి.రామకృష్ణ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష స్థానానికి విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ, ఎ.కె.బాషా, బి.డేవిడ్ రత్నకుమార్, ప్రధాన కార్యదర్శి పదవికి రావూరి చునావ్, కె.వి.రంగారావు, బైపూడి నాగేశ్వరరావు, ఎన్.వి.వి. సుబ్రహ్మణ్యం, జాయింటు సెక్రటరీ పదవికి జి.వి.లక్ష్మీ, కలపాల సుబ్బారావు, లేడీ సెక్రటరీ పదవికి జి.మాలతీ, కె.అనురాధ, లైబ్రేరియన్ సెక్రటరీగా కంచర్ల త్రినాథ్ కుమార్, పిళ్ళా సత్యనారాయణ, ట్రెజరర్‌గా ఐ.రవీంద్రనాథ్, ముద్దాడ సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.నవీన్‌కుమార్, పి.రవిబాబు పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి పిళ్ళా శ్రీనివాసరావు, అలాగే 30 సంవత్సరాల పైన ఎగ్జిక్యూటివ్ మెంబరుగా పి.వి.ఏడుకొండలు మాత్రమే నామినేషన్ వేయడంతో ఇద్దరు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

చక్కని పర్యావరణానికి అడవులు దోహదం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభిస్తున్న చిరంజీవి చౌదరి, పక్కన కల్పన తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అడవులను సంరక్షించినప్పుడు మంచి పర్యావరణం సాధ్యపడుతుందని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి చిరంజీవి చౌదరి అన్నారు. మంచి పర్యావరణం లేనప్పుడు రోడ్లు, షాపింగ్‌మాల్స్, బిల్డింగ్స్, కర్మాగారాలు ఎన్ని ఉన్నా వ్యర్థమని ఆయన పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల వృక్షశాస్త్ర విభాగం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన శుక్రవారం ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఫారెస్టును పురస్కరించుకుని సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ నల్లమల, మారేడుమిల్లిలో గడిచిన మూడు, నాలుగు నెలల్లో వర్షాలు లేవని, ముందు కురిసిన వర్షాలతో ఆ ప్రదేశాల్లో ఉన్న నీటితో ప్రస్తుతం అక్కడి ప్రజలు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇదంతా అడవుల నాశనం వల్ల జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 1990కి ముందు మనం ఆహారం కోసం వేరే వారిపై ఆధారపడే వాళ్లమని, ఇప్పుడు ఆహారం సరఫరా చేసే స్థాయికి ఎదిగామన్నారు. ఫారెస్ట్‌మెన్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత కోమెర అంకారావు మాట్లాడుతూ తులసి, రావి మొక్కలను మనం ఇంట్లో పెట్టుకుంటే 24 గంటలూ ఆక్సిజన్ ఇస్తాయన్నారు. వేపచెట్టు పెంచుకుంటే వైరస్ వ్యాప్తి ఉండదని, మర్రిచెట్టు ఊరి చివర ఉంటే పక్షులకు ఇబ్బంది కలగదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ కల్పన మాట్లాడుతూ అడవుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రకృతి వైపరీత్యాలను ప్రజలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అడవులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని వన్ ఎర్త్ వన్ లైన్ అడ్మిన్ లీలా కుమారి సహకారంతో నిర్వహించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి సలోమి, బి శైలజ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్టు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 20వ తేదీన సవలిం బసవయ్య (57)ను నున్న గ్రామం వద్ద ఆటో ఢీ కొట్టగా తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ ద్వారా బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు మృతుడి కుమారుడు సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.